పెద్దనగారు చెప్పిన ఉత్పలమాలిక

డా॥ తాడేపల్లి పతంజలి, పటాన్ చెరువు.

ఒకనాడు రాయలు భువనవిజయంలో బంగారు పళ్లెంలో గండపెండేరాన్ని తెప్పించాడు. సంస్కృతములోనూ, తెలుగులోనూ సమానంగా కవిత్వం చెప్పగలిగే వారు ఉంటే వచ్చి తీసుకోమని చెప్పాడు. సభలో ఉన్న ఎనిమిది కవులు మాట్లాడలేదు. "ముద్దుగా నేను గండపెండేరాన్ని ఇస్తానంటే ఒక్కరు కూడా వచ్చి తీసుకోరేమిటి?" అన్నాడు రాయలు. అప్పుడు పెద్దనగారు "పెద్దన బోలు పండితులు పృథ్విని లేరని నీవెఱుంగవే? పెద్దన కీదలంచినను బేరిమి నాకిడు కృష్ణరాణ్ణృపా!" అంటూ ఒక ఉత్పలమాలిక చెప్పాడు. పెద్దనగారు చెప్పిన ఆ ఉత్పలమాలిక మరియూ దాని అర్థతాత్పర్యాలు వరుసగా తెలుసుకుందాం.

పూఁత మెఱుంగులుం బసరుపూఁప బెడంగులుఁజూపునట్టివా
కైతలు? జగ్గు నిగ్గు నెనగావలెఁ గమ్మనఁ గమ్మనన్వలెన్
రాతిరియున్ బవల్ మఱపురాని హొయల్ చెలి యారజంపు ని
ద్రా తరితీపులో యనఁగఁ దారసిలన్వలె లోఁ దలంచినన్
బాఁతిగఁ బై కొనన్ వలెను బైదలి కుత్తుకలోని పల్లటీ
కూఁతలనన్వలెన్ సొగసుకోర్కులు రావలె నాలకించినన్
జేతికొలందిఁ గౌగిటను జేర్చిన కన్నియ చిన్ని పొన్ని మే
ల్మూఁతల చన్ను దోయివలె ముచ్చటగావలెఁ బట్టిచూచినన్
దాతొడనున్న మిన్నులమిటారపు ముద్దులగుమ్మ కమ్మనౌ
వాతెఱదొండపండువలె వాచవిగావలెఁ బంటనూదినన్
గాతలఁదమ్మిచూలిదొర కైవసపుం జవరాలి సిబ్బెపు
న్మే తెలి యబ్బురంపు జిగి నిబ్బర పుబ్బగు గబ్బిగుబ్బపొం
బూఁతల నున్న కాయ సరిపోఁడిమి కిన్నెర మెట్లబంతి సం
గాతపు సన్నతంతి బయకారపుఁగన్నడ గౌళపంతుకా
సాతత తానతానలపసన్ దివుటాడెడు గోటమీటు బల్
మ్రోతలునుంబలెన్ హరువు మొల్లముగావలె నచ్చతెన్గు లీ
రీతిగ సంస్కృతంబు పచరించెడు పట్టున భారతీవధూ
టీ తపనీయగర్భనికటీ భవ దానసపర్వసాహితీ

భౌతిక నాటకప్రకర భారత భారత సమ్మతప్రభా
శీతనగాత్మజా గిరిశశేఖర శీతమయూఖరేఖికా
పాతసుధాప్రపూర్ణ బహుభంగఘుమంఘుమఘుంఘుమార్భటీ
జాతక తాళయుగ్మ లయసంగతి చుంచు విపంచికా మృదం
గాతత తేహితత్తహిత హోధితధంధణుధాణుధింధిమి
వ్రాతలయానుకూల పదవారకుహూద్వహ హారికింకిణీ
నూతనఘల్లుఘల్లు చరణనూపుర ఝూళఝుళీ మరందసం
ఘాతవియద్ధునీ చకచకద్వికచోత్పలసారసంగ్రహో
యాత కుమారగంధవహహారి సుగంధ విలాసయుక్తమై
చేతము చల్లఁజేయవలె జిల్లన జల్లవలెన్ మనోహర
ద్యోతకగోస్తనీఫలమధుద్రవ గోఘృతపాయసప్రసా
రాతిరసప్రసారరుచిరప్రసరంబుగ సారె సారెకున్ ।

అర్థ తాత్పర్యాలు :

పూఁత మెఱుంగులుం బసరుపూఁప బెడంగులుఁజూపునట్టివా
కైతలు? జగ్గు నిగ్గు నెనగావలెఁ గమ్మనఁ గమ్మనన్వలెన్ (1–2)

అర్థము : పూత మెఱుంగులుం = వట్టి తళుకులు, పసరుపూఁప = లేతమొగ్గ, బెడంగులు = అందాలు, జగ్గు = తళతళ, నిగ్గు = ఉత్కృష్ట కాంతి, ఎన = సమానము.

తాత్పర్యము : వట్టి తళుకులు, లేఁతమొగ్గల అందాలు చూపునట్టివా కవితలు? తళతళలతో, ఉత్కృష్ట కాంతులతో కవితలలో పదాలు, భావాలు సమానము కావాలి. ఆ కవితలు వింటుంటే ఏదో తెలియని కమ్మని పరిమళము హృదయములోకి వ్యాపించాలి.

రాతిరియున్ బవల్ మఱపురాని హొయల్ చెలి యారజంపు ని
ద్రా తరితీపులో యనఁగఁ దారసిలన్వలె లోఁ దలంచినన్ (3–4)

అర్థము : హొయలు = విలాసము, ఆరజము = అవ్యక్తమధుర ధ్వని (విలాసము), నిద్రా = నునుపుగల, స్నేహముగల, తరితీపు = అపేక్ష, తారసిలన్ వలెన్ = సమీపించవలెను.

తాత్పర్యము : లోలోపల తలచుకొని మురిసిపోయే స్థాయిలో ఆ కవితలు ఉండాలి. విలాసాలతో, అవ్యక్త మధుర ధ్వనులతో స్నేహాపేక్షలతో ఉన్న ప్రేయసి చేష్టలు, మనస్సుకు ఎంత దగ్గరగా వచ్చి రాత్రింబవళ్లు తలచుకొని మురిసిపోతుంటామో, మంచి కవితలు మనస్సుకు అంత దగ్గరగా రావాలి. లోలోపల తలచుకొని మురిసిపోవాలి.

బాఁతిగఁ బై కొనన్ వలెను బైదలి కుత్తుకలోని పల్లటీ
కూఁతలనన్వలెన్ సొగసుకోర్కులు రావలె నాలకించినన్ (5–6)

అర్థము : బాఁతిగ = ప్రేమగా, బైకొనన్ వలెను = కౌగిలించుకోవాలి, పైదలి = స్త్రీ, కుత్తుకలోని = గొంతులోని, పల్లటీకూఁతల = పావురాల కూతలు, సొగసు = అందము (దేనిని చూస్తే సొగయుదురో – అంటే పరవశిస్తారో అది సొగసు), ఆలకించిన = వింటే.

తాత్పర్యము : నచ్చిన అందగత్తె గొంతులోనుంచి వచ్చే పావురాల కూతలవలె (ఆమె మాట్లాడే మాటలు నచ్చిన వాడికి పావురాల కూతలవలె మధురంగా ఉంటాయని భావము) ఉత్తమ కవితలు ప్రేమగా ఆలింగనము చేసుకోవాలి. మంచి కవితలు వింటుంటే అందమైన కోర్కెలు పుట్టాలి.

చేతికొలందిఁ గౌగిటను జేర్చిన కన్నియ చిన్ని పొన్ని మే
ల్మూఁతల చన్ను దోయివలె ముచ్చటగావలెఁ బట్టిచూచినన్ (7–8)

అర్థము : కొలది = 1. పరిమితి, శక్యము, పరిణామము కలది, 2. సమానమైనది; చిన్ని = మనోజ్ఞమయిన, చిన్నదయిన

తాత్పర్యము : తెలుగు కవితలు మనస్సుకు పట్టాలి. ప్రేమతో బిగి కౌగిలిలో చేర్చిన ప్రేయసి అందమయిన యౌవనసంపద శరీరానికి కలిగించే స్పర్శాసుఖము, మనస్సుకు పట్టినంత హాయిని తెలుగు కవిత కలిగించాలి. మనస్సును వీడిపోకుండా తెలుగు కవిత పట్టుకొని ఉండాలి.

డాతొడనున్న మిన్నులమిటారపు ముద్దులగుమ్మ కమ్మనౌ
వాతెఱదొండపండువలె వాచవిగావలెఁ బంటనూదినన్ (9–10)

అర్థము : డొతొడనున్న = ఎడమ తొడపై నున్న, మిన్నుల మిటారి = విలాసవతి, వాతెఱ = పెదవి (నోటికి తెరయని వ్యుత్పత్తి), వాచవి = నోటికి రుచి

తాత్పర్యము : తన వామాంకము మీద కూర్చున్న విలాసవతిని మునిపంట నొక్కినప్పుడు ఆమె దొండపండు వంటి పెదవులనుండి బయటికి వచ్చు అమృత ధారలా తెలుగు కవిత్వము చదివేటప్పుడు ఆ కవితా రసము ఆనందాన్ని కలిగించాలి.

గాతలఁదమ్మిచూలిదొర కైవసపుం జవరాలి సిబ్బెపు
న్మే తెలి యబ్బురంపు జిగి నిబ్బర పుబ్బగు గబ్బిగుబ్బపొం
బూఁతల నున్న కాయ సరిపోఁడిమి (11–13)

అర్థము : తమ్మిచూలి = బ్రహ్మ, (తమ్మియందు పుట్టినవాడు), కైవసము = అధీనము, వశము; జవరాలు = జవ్వని + ఆలు = యౌవనస్త్రీ, సిబ్బెము = స్వచ్ఛము, పొం = బంగారము

తాత్పర్యము : బ్రహ్మగారి ఇల్లాలయిన సరస్వతీ దేవి స్వచ్ఛమైన దేహకాంతికి సమానముగా తెలుగు కవిత్వము ఉండాలి. సంభ్రమము కలిగించాలి. ఆమె యొక్క కఠినమైన యౌవన సంపద రాపిడిచే బ్రహ్మగారి చేతులయందు కలిగిన కాయలా కవిత్వము శోభించాలి.

ఆ కాయ బంగారపు పూతలా ఉన్నదని కవిగారి చమత్కారము. ఇక్కడ కాయ అంటే కఠిన వస్తువును తాకుటచే చేతలయందు కాచే కాయ. దీనినే కిణము అంటారు.

కిన్నెర మెట్లబంతి సం / గాతపు సన్నుతంతి బయకారపుఁగన్నడ గౌళపంతుకా
సాతత తానతానలపసన్ దివుటాడెడు గోటమీటు బల్/మ్రోతలునుంబలెన్
హరువు మొల్లముగావలె నచ్చతెన్గు లీ రీతిగ, (13-16)

అర్థము : కిన్నెర = వీణావిశేషము, మెట్టు = స్థాయి, సంగాతము = స్నేహము, బయకారము (బయలు + కారము) = యౌవనమునందు బయలుపడు శృంగారచేష్ట, సాతత = బాగా వ్యాపించిన, తాన = తంతువు, పస = మృదుత్వము, తివుట = కోరిక, హరువు = అందము, మొల్లము = అధికము

తాత్పర్యము : వీణ వాయించేటపుడు కుడిచేత్తో మీటుతూ, ఎడమచేతి వేళ్లతో మెట్టుమీద అదిమిపట్టి స్వరాలు పలికిస్తుంటారు. కిన్నర వీణ గోటితో మీటేటప్పుడు వచ్చే అందమైన అనేకరకాలైన మోతల్లా అచ్చ తెలుగు కవితల్లో అందాలు అధికంగా పలకాలి అని కిన్నర వీణ మోతలకి, అచ్చ తెలుగు కవితల్లోని ధ్వనులకి పెద్దనగారు ఈ పంక్తుల్లో పోలిక చెప్పారు.

కన్నడ, గౌళ, పంతు మొదలయిన రాగాల స్వరాలను కిన్నర వీణ మీద పలికించే సమయంలో యవ్వన శృంగార చేష్టలు ఆ వీణా నాదాలతో పాటు వ్యాపిస్తుంటాయని, ఆ వీణా ధ్వనులు అచ్చ తెలుగు కవితల్లోని ధ్వనులు కావాలని ఆ కిన్నర వీణా నాదాలకు ఇంకో మెట్టుగా భావాన్ని పలికించారు పెద్దన.

ఇక్కడితో అచ్చతెలుగు కవిత్వంలో రసము, ధ్వని మొదలైనవి ఎలా ఉండాలో పెద్దన పూర్తి చేసారు.

సంస్కృతంబు పచరించెడు పట్టున భారతీవధూ
టీ తపనీయగర్భనికటీ భవ దానవపర్వసాహితీ
భౌతిక నాటకప్రకర భారత భారత సమ్మతప్రభా

అర్థము : పచరించెడు పట్టున = వ్యాపింపచేయు సందర్భములో, భారతీవధూటీ = సరస్వతీదేవి, తపనీయ = బంగారు, గర్భ నికటీ భవత్ = గర్భ నిర్బంధము నుండి పుట్టినదై, ఆనన పర్వ = ముఖానికి ఆనందమును కలిగించు వాగ్విభవముతో, భౌతిక = ముత్యాల కాంతి వంటి కాంతితో వెలుగొందే, నాటక ప్రకర = నాటక సమూహాలతో, భారత = భరతముని నాట్య శాస్త్రము సమ్మతించిన రూపకాలతో

తాత్పర్యము : సరస్వతీదేవి బంగారు గర్భములో పుట్టి ముఖానికి ఆనందము కలిగించు వైభవముతో ముత్యాల కాంతి వంటి కాంతితో వెలుగొందే నాటక సమూహాల కాంతితో, ప్రకాశించే ఆసక్తి కలిగించే భరతముని నాట్య శాస్త్రము సమ్మతించిన రూపక లక్షణాలు సమ్మతించేటట్లుగా సంస్కృత కవిత్వం ఉండాలి.

వివరణ : సరస్వతీదేవి బంగారు గర్భములో పుట్టటమంటే సంస్కృత కవిత్వం ఉదాత్తంగా ఉండాలని భావము.

కవి చక్కటి కవిత్వం చదువుతున్నప్పుడు వింటున్న సహృదయముల ముఖాలు ఆనందంతో వెలుగొందుతాయి. దీనినే ముఖానికి ఆనందము కలిగించు వైభవము అంటున్నారు పెద్దన.

"జానక్యాః కమలామలాంజలి పుటే... ముక్తాః తా శుభదా భవంతు భవతం శ్రీరామ వైవాహికాః" అనే శ్లోకంలో ముత్యాల కాంతి తెలుగు వారందరికి పరిచయమే. సీతమ్మ చేతులు కెంపు వర్ణంలో ఎఱ్ఱ తామర పూలలాగా ఉంటాయి. ఆ ముత్యాల తలంబ్రాలను సీతమ్మ తన చేతిలో తీసుకున్నప్పుడు అవి పద్మరాగాలయ్యాయి. రాముని నల్లని కురులపై మల్లెపూలలాగా కనిపించాయి ఆ ముత్యాలు. తలపై నుండి కిందకు జారిన ఆ ముత్యాలు రాముని రంగులో కలిసిపోయి ఇంద్రనీలమణులు అయ్యాయి.

ఆ ముత్యాల తలంబ్రాలు మనందరికీ శుభాలను కలుగజేయుగాక అని ఆకాంక్షిస్తున్నారు. ఇటువంటి భావాలతో ఉండే కావ్య నాటక సమూహాలలోని ముత్యాలకాంతి సంస్కృత కవిత్వంలో ఉండాలని కవి ఆకాంక్ష.

పెద్దనగారు ఈ పాదాలలో భారత, భారత అని రెండు సార్లు వాడారు. మొదటి భారత పదానికి ప్రకాశించే ఆసక్తి అని అర్థం. (భా = ప్రకాశము, రత = ఆసక్తి) రెండవ భారత పదము భరతుని నాట్య శాస్త్రానికి సంబంధించినది. 1. నాటకము, 2. ప్రకరణము, 3. భాణము, 4. ప్రహసనము, 5. డిమము, 6. వ్యాయోగము, 7. సమవాకారము, 8. వీథి, 9. అంకము, 10. ఈహా మృగము అను పది రకాల రూపకాలు భరతుని నాట్యశాస్త్రము

అంగీకరించినవి. వాటిలోని లక్షణాలనే ముత్యాల సౌందర్య కాంతి సంస్కృత కవిత్వంలో ఉండాలని కవి కోరిక.

శీతనగాత్మజా గిరిశశేఖర శీత మయూఖరేఖికా
పాతసుధాప్రపూర్ణ,

తాత్పర్యము : హిమవంతుని కుమార్తె అయిన పార్వతీఅమ్మవారితో కలిసిన పరమశివుని సిగమీద ఉన్న చంద్రకళ నుంచి కిందికి జారే అమృతపు వానలా సంస్కృత కవిత్వము పరిపూర్ణంగా శోభించాలి. (అంటే సంస్కృత కవిత్వం అమృతంలా ఉండాలని భావం.)

హిమాలయము అనటానికి అద్రిరాజము, ఉదగద్రి, కొండఱేడు, కోడెకొండ, గట్టులరేడు, ధరణము, నగాధిరాజము, పర్వతపతి – ఇలాంటి పదాలు ఎన్నెన్నో ఉన్నాయి. కాని కవి కావాలనే శీత నగము అనే పదము వాడాడు. చల్లదనంతో పోలికగల ఈ పద్యంలో శీతనగము అని ప్రయోగించిన పెద్దన నిజంగా పెద్దనే.

బహుభంగఘుమంఘుమఘుంఘుమార్భటీ
జాతక తాళయుగ్మ లయసంగతి చుంచు విపంచికా మృదం
గాతత తేహితత్తహిత హోధితధంధణుధాణుధింధిమి
వ్రాతలయానుకూల పదవారకుహూద్వహ హారికింకిణీ
నూతనఘల్లులా చరణనూపుర ఝూళఝుళీ మరందసం
ఘాతవియద్ధునీ చకచకద్వికచోత్పలసారసంగ్రహా
యాత కుమారగంధవహహారి సుగంధ విలాసయుక్తమై
చేతము చల్లఁజేయవలె జిల్లన జల్లవలెన్ మనోహర (27–28)

రౌద్రభీభత్స రసములలో కావ్య రచనకు ఉపయోగపడు ఒక వృత్తిని ఆరభటి అంటారు. ఇది ప్రౌఢంగా ఉంటుంది. సంస్కృత కవిత్వము అనేకరకాలైన ఘుమంఘుమఘుంఘుమల ప్రౌఢిమ నుండి బయట పడు లయ తాళముల మేలికూర్పుతో ఉండాలని పెద్దన చెబుతున్నారు.

ఆ ప్రౌఢిమ "ఘుమంఘుమఘుంఘుమ" గా ఉంటుందని చెప్పటంలో ఒక చమత్కారముంది. "ఘుమంఘుమఘుంఘుమ" సంస్కృత కవిత్వములో ప్రౌఢ శైలి ఎలా ఉంటుందో చెప్పకుండా చెబుతోంది. ఆ శైలిలోని పదాలు వింటున్న వారికి హృదయంలోకి పరిమళం వ్యాపించాలని కవి వాక్కు. కృష్ణశాస్త్రి గారు పదాలకు రంగు, రుచి, వాసన ఉంటాయని పెద్దనగారి ఈ పంక్తి చూసి అన్నారేమో! ఏమో!

వీణెలోనగువాని మ్రోతలతో, తేహితత్తహిత హాధితధంధణుధాణుధింధిమి మొదలయిన మృదంగ ధ్వనులు కలిసిన సమూహములకు అనుకూలంగా ఉండే కోకిలల శ్రావ్యమైన మధుర ధ్వనులతో, గమకితములైన (అధికములైన) మనోహరములయిన చిఱుమువ్వల సవ్వడులు సంస్కృతకవిత్వము కలిగి ఉండాలి. (మువ్వ అంటే మూడు గీరలవంటి సందులుగల పెద్దగజ్జె. చిరు మువ్వ అంటే చిన్న గజ్జె.)

కొత్తవైన కాలి అందెలు ఘల్లు ఘల్లుమని మోగుతుంటే ఆ చప్పుళ్లు మరందపు రుచిలా చక్కగా ప్రకాశిస్తాయి. అటువంటి మరందపు రుచి కలిగిన నల్ల కలువల పూల యొక్క ప్రేమ సంకేతములైన పుప్పొడితో కలిసి, బూడిద రంగును పొంది, అతిశయించిన మలయ మారుతపు పిల్లగాలుల అందమయిన సువాసనలను విలాసములు పుట్టిస్తూ సంస్కృత కవిత్వము మనస్సులో పోలికలేని ఆనందాన్ని కలిగించాలి.

ద్యోతకగోస్తనీఫలమధుద్రవ గోఘృతపాయసప్రసా
రాతిరసప్రసారరుచిరప్రసరంబుగ సారె సారెకున్ । (27-28)

హృదయాన్ని మురిపించే ద్రాక్షాఫలము (గోస్తని), తేనె, ఆవునెయ్యి పాయసములతో కలగలిపిన గొప్పదయిన అతిరసమను పదార్థమునుండి వచ్చే ఆనంద ప్రసారంలా మాటి మాటికీ సంస్కృత కవిత్వము మైమరిపించాలి.

విశేషాలు : కావ్యాంగాలు రసం, అలంకారం, ధ్వని, గుణము మొదలయినవి. వీటిని పెద్దనగారు సంస్కృత కవిత్వ లక్షణాలలో తనదయిన శైలిలో పేర్కొన్నారు.

ముగింపు : మాలికలు వ్రాసిన వారు ఎంతో మంది ఉన్నారు. కాని మాలిక అని చెబితే ప్రథమ తాంబూలము పెద్దనగారి ఈ ఉత్పల మాలికకే.

పెద్దనగారు ఈ మాలికలో వాడిన పదాల వెనుక అంతులేని ఆలోచనా సాగరాలు ఉన్నాయి. పూలని, వెన్నెలని, కాంతిని, రుచులను ప్రేమించగలిగేవాళ్లు మాత్రమే ఈ ఉత్పల మాలికను ఆస్వాదించగలరు. ఈ ఉత్పలమాలికను చదవటానికి కావాలిసిన అర్హత ఇదే. ✦ .... (సశేషం)

విశ్వమ్భరావిశ్వమాతృసవ్యాసవ్యకరగ్రహః ।
విశ్వమ్భరాకృష్ణవేణీసంసేవాసుఖితాశయః ॥

– బెల్లంకొండ రామరాయకవి,
విష్ణుసహస్రనామస్తోత్రమ్.